క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ వరలక్ష్మి

సరుబుజ్జిలి: మండలంలోని షళంత్రి పంచాయతీ పరిధిలోని బురిడివలస జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ బత్తిని వరలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈటీపీఆర్టీ బొడ్డేపల్లి రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అదపాక గొరినాయుడు, ఎడ్ల ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై నిలదీత



తాగునీటి కోసం ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు రజినీ

హిరమండలం: మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎంపీటీసీ సభ్యురాలు మీసాల రజినీతోపాటు పలువురు సభ్యులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిని నిలదీశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. గత మూడు నెలలుగా హిరమండలం ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, నీటి కోసం మహిళలు రోడ్డెక్కిన పరిస్థితులు ఏర్పడ్డాయని సభ దృష్టికి సభ్యులు తీసుకువచ్చారు. ఆర్‌డబ్ల్యూస్ ఏఈ సాగర్ మాట్లాడుతూ త్వరలోనే తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అధికారులు తమ శాఖల పనితీరును, ప్రగతిని చదివి వినిపించారు. ఎంపీడీఓ ఆర్.కాళీప్రసాద్, తహసీల్దార్ హనుమంతురావు, జెడ్పీటీసీ బుచ్చిబాబు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు టి.తిరుపతిరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికను పరిశుభ్రం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న క్రైస్తవ సంఘ నాయకులు

ఆమదాలవలస: పట్టణంలోని పూజారిపేట వద్ద ఉన్న క్రిస్టియన్ మైనారిటీ శ్మశాన వాటికను పరిశుభ్రం చేయాలని శామ్యూల్ అరుణ్ కుమార్ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ మేనేజర్ బి.లక్ష్మీనారాయణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కాంపౌండ్ వాల్ లేకపోవడంతో అపరిశుభ్రంగా ఉందన్నారు. వినతిపత్రం అందించిన వారిలో క్రైస్తవ సంఘ నాయకులు సవలాపురపు అసిర్ కుమార్, అహరోన్ రాజ్, తదితరులు ఉన్నారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన



చెల్లాయివలస వద్ద రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి, తదితరులు

పోలాకి: మండలంలోని పలుచోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మాణం చేపట్టనున్న బీటీ రహదారులకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.6 కోట్ల అంచనా వ్యయంతో డోల-జొన్నాం-వనితమండలం వరకు, రూ.2 కోట్లతో డీఎన్ రోడ్డు-కేసీ రోడ్డు(వయా చెల్లాయివలస, ఓదిపాడు, చీడివలస) మీదుగా రహదారి నిర్మాణానికి భూమిపూజ చేశారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు సహకరించండి

మెళియాపుట్టి: సారా తయారీలో వినియోగించడానికి పెద్ద మొత్తంలో బెల్లాన్ని కొనుగోలు చేయడానికి ఎవరైనా వస్తే వారి సమాచారాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి అందజేయాలని టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరాసాహెబ్, తహసీల్దార్ పాపారావు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బెల్లం వర్తకులతో సమావేశం నిర్వహించారు. సారా తయారీకి కావలసిన ముడిసరుకుల్లో ముఖ్యమైనది బెల్లమని, దీన్ని విక్రయిస్తే పరోక్షంగా సారా తయారీకి వర్తకులు కూడా సహకరిస్తున్నట్లు అవుతుందన్నారు. షాపుల్లో అధిక మొత్తంలో బెల్లం నిల్వలు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. సారా తయారీదారులు పోలీసులకు చిక్కితే వారు ఏ షాపులో బెల్లాన్ని కొనుగోలు చేశారో.. ఆ షాపు యజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు. మెళియాపుట్టి ఎస్ఐ రమేష్ బాబు, సీనియర్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలు.. అర్హులకు అందేనా?



నరసన్నపేటలో బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు వచ్చిన దరఖాస్తుదారులు (ఫైల్)

- యూనిట్లు తక్కువ.. దరఖాస్తులు ఎక్కువ
- సామాన్యుల్లో సన్నగిల్లుతున్న ఆశలు
- టీడీపీ నాయకుల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు

నరసన్నపేట: చేతిలో విద్యా అర్హతలున్నాయి. వ్యాపార అనుభవం ఉంది. చిన్నపాటి పరిశ్రమ పెట్టుకొని కుటుంబాన్ని పోషించుకోవచ్చనే ఆలోచన ఉంది. కావాల్సినదంతా పెట్టుబడి.. ప్రభుత్వ సహాయం. ఈ దశలో ప్రభుత్వం బీసీలతోపాటు ఈడబ్ల్యూసీ, కుమ్మర్లు, కాపులు, మేదర్లకు వేర్వేరుగా ఆయా కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఇటీవల ప్రకటించింది. బ్యాంకులు పెట్టుబడికి అప్పులు ఇస్తాయి. ప్రభుత్వం కొంత సబ్సిడీ ఇస్తుంది. లోను మంజూరైతే స్వగ్రామంలోనే ఉపాధి కలుగుతుందని, తల్లిదండ్రులు, భార్య, పిల్లల చెంతే ఉండవచ్చనే ఆశతో అనేక మంది దరఖాస్తు చేశారు.

ఆశలకు గండి..

సబ్సిడీ రుణాల ఆశావహులకు మొదట్లోనే ప్రభుత్వం గండి కొట్టింది. ఒక్కో మండలానికి 90 నుంచి 120 యూనిట్లు మాత్రమే కేటాయించింది. నరసన్నపేట నియోజకవర్గంలోని నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పోలాకి మండలాల్లో మొత్తం 392 యూనిట్లు మంజూరు చేశారు. 2,113 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లోనూ ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్నవారు ఎంతో ఆశతో ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.

నరసన్నపేటలో సబ్సిడీ యూనిట్ల కేటాయింపు, దరఖాస్తుల వివరాలు..

మండలం	మంజూరైన యూనిట్లు	దరఖాస్తులు
నరసన్నపేట	102	719
జలుమూరు	101	460
పోలాకి	114	589
సారవకోట	75	345

పెరిగిన రాజకీయ జోక్యం..

సబ్సిడీ రుణాలపై రాజకీయ జోక్యం పెరిగింది. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీల పెత్తనం సాగింది. వారు ఎవరి పేరు చెబితే వారికే సబ్సిడీ రుణాలు ఇచ్చారు. ఇప్పుడు ఆ కమిటీలు లేకపోయినా.. గ్రామాల్లో కూటమి వ్యవహారాలు చూస్తున్న నాయకులు జాబితాలను తయారు చేస్తున్నట్లు సమాచారం. ఈ జాబితాలను అధికారుల వద్దకు ఎమ్మెల్యే పంపుతున్నారని తెలుస్తోంది. దీంతో దరఖాస్తుదారుల్లో నిరాశ అలుముకుంది. అధికారం చేపట్టి 10 నెలలు అవుతున్నా.. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలు చేయలేదు. ఈ దశలో సబ్సిడీ రుణాలైనా అర్హులకు అందుతాయనే ఆశ ఉండగా.. కూటమి నాయకులు నీళ్లు చల్లుతున్నారని దరఖాస్తుదారులు ఆవేదన చెందుతున్నారు. ఇదే అవకాశంగా కూటమి పార్టీల సానుభూతిపరులు, గతంలో సబ్సిడీ రుణాలు పొందినవారు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో అన్ని అర్హతలున్నవారు ఆందోళన చెందుతున్నారు.

అర్హులకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం



మండలంలో సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాం. వీరిలో అర్హులకు రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బ్యాంకుల వారీగా సబ్సిడీ రుణాలు ఎవరెవరికి ఎన్ని అనేది జిల్లా అధికారులు కేటాయించారు. దీని ప్రకారం అర్హులను ఎంపిక చేసి బ్యాంకులకు జాబితాలు పంపిస్తాం. పోటీ తీవ్రంగా ఉంది. ఒక్కో రుణానికి ఏడుగురు చొప్పున పోటీ పడుతున్నారు. ఈ ప్రక్రియ ఈ నెలాఖరులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– బి.మధుసూదనరావు, ఎంపీడీఓ, నరసన్నపేట

అర్హులకే రుణాలు ఇవ్వాలి



ఎంతో ఆశతో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేశాం. అర్హతే ప్రామాణికంగా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి. రాజకీయ జోక్యం ఉండకూడదు. గత ప్రభుత్వం ఎన్నికల వరకే రాజకీయం చూసింది. తరువాత ఏ పథకమైనా అర్హతే ప్రామాణికంగా మంజూరు చేసింది. దీనిని కూటమి ప్రభుత్వం కొనసాగించాలి. గతంలో రుణాలు పొందిన వారికి ఇవ్వకూడదు.

– కింతలి విశ్వనాథం, దాసరివానిపేట, నరసన్నపేట మండలం

పేదల ఆరోగ్యానికి భరోసా లేదు

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పేదల ఆరోగ్యానికి భరోసా లేకుండా పోయిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రికి వెళ్లిన రోగులకు ఎన్టీఆర్ వైద్య సేవలు(ఆరోగ్యశ్రీ) అందడం లేదన్నారు. జిల్లా కేంద్రం నుంచి మండల స్థాయి వరకు ఉన్న అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ మందులు అందుబాటులో లేవన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు మందులు కూడా అందివ్వలేని పరిపాలన కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో వైద్యం కోసం లక్షలాది రూపాయలు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఉన్నత చదువుల కోసం అనేక మంది డాక్టర్లు ప్రాథమిక ఆస్పత్రులను వదిలి వెళ్లారని, వారి స్థానంలో కొత్త డాక్టర్లను నియమించటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ ఆస్పత్రులకు ఇచ్చిన మందులే ఇప్పటివరకు సర్దుబాటు అయ్యాయన్నారు. రూ.25 లక్షలకు ఆరోగ్యశ్రీ పరిధిని పెంచిన గొప్ప నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఇంటి వద్దకే వచ్చి బీపీ, సుగర్‌తోపాటు అనేక వ్యాధులకు నెలకు సరిపడా మందులు ఉచితంగా అందించిన ఘనత గత ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన జగనన్న పాలనతో మన రాష్ట్రం అనేక అవార్డులు అందుకుందని గుర్తుచేశారు.

సాగు హక్కులు కల్పించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

హిరమండలం: గిరిజనులు సాగుచేస్తున్న భూములకు హక్కులు కల్పించాలని, గిరిజన గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సవర గోపి, కె.రమేష్, తదితరులు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండలంలోని మర్రిగూడ పంచాయతీ పరిధిలో ఉన్న గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బొండిగూడలో గిరిజనులు 1,500 ఎకరాల్లో సాగుచేస్తుంటే కేవలం 120 ఎకరాలకు మాత్రమే పట్టాలు ఇచ్చారన్నారు. ఈ గ్రామంలో ఇళ్లు కట్టుకునేందుకు అటవీశాఖ నుంచి పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరుచేయాలన్నారు. బొండిగూడ నుంచి మల్లెలగూడ, సీతంపేటకు 10 కిలోమీటర్ల మేర బీటీ రహదారి నిర్మించాలన్నారు. మర్రిగూడ నుంచి బొండుగూడకు రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. తహసీల్దార్ హనుమంతురావుకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

అధ్వానం..



సారవకోట మండలంలోని కొమ్మసరియాపల్లి జంక్షన్ నుంచి వాండ్రాయి, బెజ్జి వెళ్లే రహదారి పూర్తిగా పాడైంది. రహదారిలో ఎక్కడిక్కడే గోతులు ఏర్పడ్డాయి. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారిని వెంటనే బాగుచేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

– సారవకోట

తాగునీరు వృథా



సారవకోట మండలంలోని కిన్నెరవాడ గ్రామంలో తాగునీటి కుళాయిల ట్యాప్‌లు పాడైపోవడంతో తాగునీరు వృథాగా పోతుంది. నాలుగు రోజుల నుంచి నీరు వృథాగా పోతుందని స్థానికులు తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– సారవకోట

వేడుకగా పట్టాభిషేకం



ఆమదాలవలస మండలం పొన్నాంపేటలో గల రామాలయంలో సీతారామ స్వామి పాదుక పట్టాభిషేకాన్ని వేడుకగా నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ చల్లా ఉష, మాజీ సర్పంచ్ చల్లా సింహాచలం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– ఆమదాలవలస

అభినందన



జలుమూరు మండలంలోని పాగోడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు జి.రాహుల్, ఎం.మోక్షవర్ధన్ నవోదయలో ఆరో తరగతికి ఎంపిక కావడంతో ఎంఈఓలు బి.మాధవరావు, ఆర్.ఎస్.ప్రసాదరావు సోమవారం అభినందించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో నవోదయ ప్రవేశానికి కావాల్సిన ధ్రువపత్రాలను అందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు కె.అప్పన్నను ప్రత్యేకంగా అభినందించారు.

– జలుమూరు

రాజ్యాంగబద్ధంగా గ్రామ సభలు నిర్వహించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వెంకటరావు, మిశ్రో, తదితరులు

ఎల్.ఎన్.పేట: ఈ నెల 14వ తేదీన సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరగనున్న గ్రామ సభలను రాజ్యాంగబద్ధంగా నిర్వహించాలని ఎంపీడీఓ పైడి శ్రీనివాసరావును ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి పెద్దకోట వెంకటరావు, ఎల్.ఎన్.పేట మండలశాఖ గౌరవ అధ్యక్షుడు ఎం.కె.మిశ్రో కోరారు. ఎంపీడీఓకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఒకేరోజు, ఒకే సమయంలో ఎక్కువచోట్ల గ్రామ సభలు నిర్వహించటం వలన.. అధికారులు అన్ని గ్రామ సభల్లో పాల్గొనలేక పోతున్నారన్నారు. అన్ని శాఖల అధికారులు గ్రామ సభలకు హాజరయ్యేలా చూడాలని, గ్రామ సభలకు గైర్హాజరయ్యే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అజెండాను ముందుగానే పంచాయతీ పాలకవర్గానికి అందజేయాలన్నారు. గ్రామ సభలో ఆడియో, వీడియో రికార్డు సదుపాయం కల్పించాలన్నారు.

శిలాఫలకం తొలగించి.. ప్రభుత్వ స్థలం ఆక్రమణ..!



శిలాఫలకాన్ని తొలగించిన దృశ్యం

ఆమదాలవలస: మండలంలోని కొత్తవలస జంక్షన్ వద్ద ఉన్న శిలాఫలకాన్ని కొంతమంది వ్యక్తులు తొలగించి.. రోడ్డును ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. అభివృద్ధి పనుల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం ఎస్.ఆర్.పీ నిధులు రూ.2 కోట్లతో 2022 జూలైలో శిలాఫలకాన్ని వేశారు. కొత్తవలస నుంచి కొల్లివలస వరకు తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఈ జంక్షన్‌లో సెంటు విలువ సుమారు రూ.5 లక్షల పైనే ధర పలుకుతోంది. వాణిజ్యానికి అనుకూలంగా ఉండడంతో షాపులు ఇబ్బడిముబ్బడిగా ఏర్పడుతున్నాయి. ఇదే అదునుగా కొంతమంది వ్యక్తులు రోడ్డు మార్జిన్‌ను ఆక్రమిస్తున్నారు. ఈ ఆక్రమణల విషయమై ఆర్అండ్‌బీ ఏఈ ఎస్.శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

వీఆర్ఏలకు ఉద్యోగోన్నతి కల్పించాలి



పొందూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న త్రినాథరావు, వీఆర్ఏలు

పొందూరు: అర్హులైన వీఆర్ఏలకు రెవెన్యూ శాఖలో ఉద్యోగోన్నతి కల్పించాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు తెండేల త్రినాథరావు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ వెంకటేష్ రామానుజులకు వినతిపత్రాన్ని అందజేశారు. రికార్డు అసిస్టెంట్‌లు, వీఆర్ఓలు స్థాయి ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. గత 8 ఏళ్లుగా జీతాలు పెరగకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో వీఆర్ఏల కుటుంబాలు సతమతమవుతున్నాయని పేర్కొన్నారు. పొందూరు మండలం వీఆర్ఏలు పాల్గొన్నారు.

పే స్కేల్ అమలు చేయాలి

పాతపట్నం: తెలంగాణలో అమలు అవుతున్న విధంగా మన రాష్ట్రంలోని వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలని పాతపట్నం మండల వీఆర్ఏలు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్‌కు తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, వీఆర్ఏ పోస్టులను అర్హులైన వీఆర్ఏలకు ప్రమోషన్లు ఇచ్చి భర్తీ చేయాలన్నారు.



పాతపట్నం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

ఉచిత శిక్షణను వినియోగించుకోవాలి

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలకు ఉచితంగా కోచింగ్ ఇవ్వడం జరుగుతందని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. హిరమండలం ప్రభుత్వ పాఠశాలలో ఉచిత కోచింగ్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. హెచ్ఎం కేశవరావు, సైన్స్ ఉపాధ్యాయుడు కె.క్రాంతిరాజు ఉచిత కోచింగ్ నిర్వహణ కోసం తీసుకుంటున్న శ్రద్ధకు అభినందించారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఆమదాలవలస: విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు మంగళవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (క్యాంప్ కోర్ట్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈఈ పైడి యోగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆమదాలవలస పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న తొగరాం సెక్షన్ కార్యాలయం వద్ద ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కన్జ్యూమర్ గ్రీవెన్స్ ఫోరం చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. వినియోగదారులకు ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా తెలియజేవచ్చన్నారు.

న్యాయం చేయండి

పొందూరు: తన కుమారుడు గొర్లె కన్నారావు మృతిపై దర్యాప్తు చేసి న్యాయం చేయాలని పొందూరు మండలంలోని ఎరుకుల కాలనీకి చెందిన శ్రీరాములు సోమవారం జిల్లా ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తన కుమారుడిది ఆత్మహత్య కాదన్నారు. కోడలు, ఆమె తల్లిదండ్రులతోపాటు వారి బంధువులు హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని కోరారు. గత నెల 10వ తేదీన కన్నారావు కొత్తూరు సర్కిల్ హిరమండలం సమీపంలో మృతి చెందాడని, గత నెల 15న ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై మార్చి 19న కొత్తూరు సీఐ తమ కుటుంబాన్ని పిలిచి దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని చెప్పారని, ఇంతవరకు స్పందించలేదన్నారు.

విద్యార్థుల చేరికలపై దృష్టి పెట్టండి

నరసన్నపేట: రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల చేరికలు పెరిగేలా గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. కోమర్తి, తదితర గ్రామాల్లో ఎంఈఓలు, ఉపాధ్యాయులు పర్యటించారు. విద్యార్థుల తల్లిదండ్రులను నేరుగా కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సదుపాయాలను వివరించారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

బూర్జ: గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా నాయకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పర్యావరణం, పంటలు, తాగు, సాగు నీటిని కలుషితం చేసే థర్మల్ పవర్ ప్లాంట్ ప్రతిపాదనను నిలిపివేయాలన్నారు. తహసీల్దార్ వై.వి.పద్మావతి వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా నాయకులు కె.నాగమణి, ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ మార్పుపై ఆందోళన

సారవకోట: మండలంలోని పలు రేషన్ డిపోలకు సరుకులు అందించే ఎంఎల్ఎస్ పాయింట్‌ను మార్పు చేయడంపై రేషన్ డీలర్లు ఆందోళన చెందుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సారవకోటలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌ను జలుమూరుకు తరలించారు. దీంతో మండల పరిధిలో ఉన్న రేషన్ డీలర్లు జలుమూరు నుంచి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం 16 రేషన్ డిపోలను కోటబొమ్మాళి, మెళియాపుట్టి మండలాల ఎంఎల్ఎస్ పాయింట్‌లకు అనుసంధానం చేశారు. సుదూరంగా ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్లు నుంచి సరుకులు తెచ్చుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రేషన్ డీలర్లు ఆందోళన చెందుతున్నారు.

నేటి నుంచి తిరుక్కల్యాణ మహోత్సవాలు

పొందూరు: ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు మండలంలోని మజ్జిలిపేట గ్రామంలోని సీతాకోదండ రామస్వామి ఆలయం 88వ వార్షిక తిరుక్కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న సీతారాముల కల్యాణ మహోత్సవం, 9న అన్నసమారాధన, 10న హోమాలు, 11న నాగవల్లి మంటపారాధన, 12న శ్రీవారి వసంతోత్సవం, మహాపూర్ణాహుతి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఆక్రమణల తొలగింపు



కొరసవాడలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామంలో గల శ్మశాన వాటిక పక్కన, మహేంద్రతనయ నదీ తీరంలో ఉన్న ఆక్రమణలను రెవెన్యూ, పంచాయతీ అధికారులు సోమవారం తొలగించారు. ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించి జీడిమామిడి మొక్కలు వేశారు. తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు వీఆర్వో బి.తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శి ఎ.కృష్ణంరాజు ఆక్రమణలను తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

హర్షనీయం..

పాతపట్నం మండలంలోని ప్రహరాజపాలెం రెవెన్యూ పరిధిలో గల కొత్త చెరువు ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించడం హర్షనీయమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బి.నారాయణమూర్తి అన్నారు. ఈ చెరువు రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఆక్రమణలపై గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.